# జాలిపడు...

## పెనుమాక నాగేశ్వరరావు




వరండాలో కూర్చుని కథ వ్రాసుకుంటున్నాను. ఇంటిముందు ఆటో ఆగిన శబ్దం కావటంతో వీధిగేటు వైపు చూశాను. ఆటో దిగి డ్రైవరుకు డబ్బులిస్తున్న ఉపేంద్రని చూడగానే కలమూ, కాగితాలు పక్కనపెట్టి వాడికి ఎదురు వెళ్లాను.

కొంచెం దూరం నుంచే వాడి ముఖం గమనించాను. చాలా సీరియస్‌గా ఉన్నట్లనిపించింది. దగ్గరగా వెళ్లాక నవ్వుతూ పలరించాన్నేనే. సమాధానం ఏమీ చెప్పకుండా నడిచాడు ఉపేంద్ర.

"ఏమి ఉపద్రవం వచ్చిందిరా భగవంతుడా" అని మథనపడుతూ వాడ్ని అనుసరించాను.

అంతలోనే ఇంట్లోంచి బయటకి వచ్చిన నా శ్రీమతి జయంతి "ఏం అన్నయ్యగారూ.... బావున్నారా... ఇప్పుడేనా రావడం" లాంటి రెండు మూడు ప్రశ్నల్ని యాంత్రికంగా అడగటం, వాటికి వాడు అతిసాధారణంగా జవాబు చెప్పి "కాసిన్ని మంచినీళ్లు తెచ్చివ్వమ్మా" అని అడగటం పూర్తయ్యాక నా మనసు కాస్తంత కుదుటపడింది. ఎందుకంటే వాడి కోపం నా ఒక్కడి మీదేనని తేలి పోయింది. కాక పోయ ఉంటే వాడు ఆమె క్కూడా సమాధానం చెప్పి ఉండేవాడు కాదు. వాడి స్వభావమే అంత. కోపాన్నిగాని, సంతోషాన్ని గాని దాచుకోలేడు, ఆపుకోన్నూ లేడు.

నిజంగా అలాంటివాళ్ల దగ్గర ఎంత ఆత్మీయంగా, ఆప్యాయంగా ఉండాలి? వాడితో నాకు స్వానుభవం చాలా ఉంది. ఎప్పటప్పటి విషయాలు మనసులో పెట్టుకుని, పరోక్షంగా సాధిస్తూ పైకి మాత్రం నంగనాచుల్లా, కల్లబొల్లి ప్రేమ నటించేవారు. ఎంత తీయగా మాట్లాడితే మాత్రం ఏం ప్రయోజనం! ఉపేంద్ర లాంటివారు కరుగ్గా మాట్లాడినా, తిట్టదలచుకున్నపుడు ముఖాన్నే తిట్టినా, నిర్మోహమాటంగా మాట్లాడినా, కల్లాకపటంలేని కల్మషం లేని ఆ మనస్తత్వం ఉండటం భగవంతుడు ఇచ్చిన వరమే అనిపిస్తుంటుంది నాకు.

అలాంటి సందర్భాల్లో ఒక్కొక్కసారి వాడితోపాటు నేనూ మౌనం వహించి వాడ్ని మరికాస్త ఉడికిస్తాను. శ్రీమతి తెచ్చిచ్చిన మంచినీళ్ళు తాగాడు. నేను ఈలోగా కావాలనే కలమూ, కాయితాలూ చేత పుచ్చుకున్నాను.

"ఎంత సేపటికీ నీ కథలు, నీ గోల తప్ప, ఇంటికి మనిషి ఒకడు వచ్చి తగలడ్డాడు, వాడితో మాట్లాడాలన్న జ్ఞానమేం లేదా?"

"....."

"సమాధానం చెప్పవేంరా"

"నువ్వంత కోపంగా ఉండగా, నేనెప్పుడైనా మాట్లాడానా... నాకంత ధైర్యం లేదని నీకు తెల్సుగా" భయం నటిస్తూ అన్నాను.

"ఈ సొల్లు కబుర్లే వద్దనేది. నేనంటేనే ఏదో పెద్ద భయపడి చస్తున్నట్లు"

"నిజంగా, నువ్వు కోపంగా ఉన్నపుడు మాట్లాడాలంటే నాకు భయమేరా బాబోయ్" అన్నాను.

వాడి ముఖంలో కాస్తంత ప్రసన్నత.

"ఏడ్చావులేగానీ ఆఫీసుకు శెలవు పెట్టి మరీ కథలు వ్రాసుకుంటూ కూర్చున్నావ్... పోటీకి పంపించాలనా?"

"అదేంకాదు. కథలు వ్రాయటానికి శెలవ్ పెట్టలేదు"

"మరి!"

"ఇయరెండింగ్ కదా. కొత్త సంవత్సరం వచ్చేలోపు పన్నెండు రోజులు లీవు వాడుకోకపోతే వేస్టయిపోతాయ్. అందుకు శెలవు పెట్టాను" చెప్పేన్నేను.

"అదృష్టవంతుడివి. మాకేమో ఎన్ని శెలవలైనా చాలటం లేదు. నీకేమో శెలవలు ఎక్కువైపోయి అవి మురిగిపోయే పరిస్థితిలో అవసరం లేకపోయినా శెలవలు పెట్టి హాయిగా ఇంట్లో కూర్చుంటున్నావ్. అవున్లే, పెళ్లాం పిల్లల్ని వదిలి వేరేచోట ఉద్యోగం చేస్తే తెలుస్తుంది శెలవలు ఎట్లా అయిపోతాయో. పుట్టిన ఊళ్ళోనే శిలేసుకుపోయిన నీలాంటి వాళ్లకేం తెలుస్తుంది మా బాధ."

"సరేలే ఈ దెప్పి పొడుపులు, నిష్ఠూరాలూ ఎప్పుడూ ఉండేవే గాని, ఏమిటీ వస్తూనే

[illegible] వేంచేశావ్. నా అపరాధం [illegible] తెలుసుకోవచ్చా" అడిగాను.

"అపరాధం నీదికాదు.... నాది. ఎప్పుడూ అలవాటు లేని పని ఈ రోజు చేశాను, ఆ అపరాధానికి ప్రతిఫలంగా అపరాధ పరిశోధకుల్లా వేసిన ప్రశ్న వేయకుండా వేశారు వాళ్లు, ఇరుక్కుపోయాన్నేను".

"కాస్త అర్థమయ్యేటట్లు చెప్పరా నీకు పుణ్యం ఉంటుంది".

"ఎప్పుడొచ్చినా సరాసరి నీ ఇంటికే రావడం నాకు అలవాటు కదా. బుద్ధి గడ్డి తిని ఇవ్వాళ మీ ఆఫీసుకు వెళ్లాను. నిన్ను అక్కడే కలసుకుని మాట్లాడి, అట్నుంచి అటే వెళ్లిపోవాలనే ఆలోచన్తో బయల్దేరాను. కాని ఏం లాభం తమరు హాయిగా శెలవు పడేసి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారాయె!"

"ఇంతకీ నిన్ను ప్రశ్నల పరంపరతో విసిగించి, వేధించిన వాళ్లెవర్రా.... కొంపదీసి మా ఆఫీసువాళ్లు కాదు కదా!"

"కాకపోవటమేమిటీ! అక్షరాలా ఆఫీసులో వాళ్లే... మీ ఆఫీసులో వాళ్లే నాయనా".

"వీడు గానీ వాళ్లని నోటికొచ్చినట్లు తిట్టి రాలేదు కదా" అనిపించగానే గుండె గుభేలు మన్నది.

"ఎవన్నా గొడవ జరిగిందా ఏమిట్రా" ఎంత దాచుకోవాలన్నా కంగారు ధ్వనించకపోలేదు నాగొంతులో.

"గొడవెందుకు జరుగుతుందీ?" వచ్చిన చిక్కల్లా చెప్పేవాడు అడిగేవాడికి లోకువ అంటారుగా అదే ఎదురయ్యింది నాకు.

"దయచేసి అదంతా సవివరంగా చెప్పరా బాబూ"

"సవివరంగా, సవిస్తరంగా చెప్తాను విను... మీ ఆఫీసుకు వెళ్లాను. నీ గురించి అడిగేను. "శెలవు" అని చెప్పారు. ఎన్ని రోజులు అని అడిగేను. "తెలీదు" అన్నారు వాళ్లు. "ఊళ్లో ఉన్నాడా" అనడిగాను. "తెలీదు" అన్నారు. ఇంటి అడ్రస్ తెలుసా" అని అడిగేన్నేను.

"నీకు తెలుసు కదరా? వాళ్లనెందుకు అడిగావ్" కోపంగా అడిగేను ఉపేంద్రని.

"తెలీక కాదు అడిగింది. నీ అడ్రస్ అయినా చెప్తారో అదీ తెలీదు అనే చెప్తారో చూద్దామనిపించి అడిగాను. నలుగురో, అయిదుగురో సరిగా తెలీదన్నాక ఆరో వ్యక్తి టూకీగా చెప్పాడు. అందుకు నాకు కోపం రాలేదు" అని వాలు కుర్చీలో వాలేడు ఉపేంద్ర.

"అంటే వీడికి కోపం (వచ్చిన) తెచ్చిన సంఘటన మరోటి జరిగిందన్నమాట" కంగారు పడ్డాను.

"ఇంకా ఏమైందిరా" ఆత్రంగా అడిగేశాను ఉండబట్టలేక.

"ఏంజరిగిందా.... వాళ్ల సమాధానాలు విని నాపాటికి నేను వెనుదిరిగేను. ఊరుకోవచ్చుగా, నా వెనకాలే నలుగురు కాబోలు బయల్దేరారు బయట మెయిన్ గేటు దాకా. ఊరకనే మర్యాదకోసం కాదు. ఆ మధ్య దారిలో వాళ్లు నన్ను ప్రశ్నల వర్షంతో తడిపి ముద్ద చేశారు.

నేనెవర్ని, నాపేరేంటి, నీకు నేను ఏమవుతాను? ఎందుకు వచ్చాను. ఎన్నాళ్ళు ఉంటాను? ఇంతవరకు నాకూ ఏం అభ్యంతరం అనిపించలా. అటుపైన ఒకడు

"అవును మీవూళ్ళో, ఆయనకి పొలం కూడా ఉందిగా. అమ్మాలనుకుంటున్నాడు, బేరం ఏమైనా వచ్చిందా" అనీ ఇంకొకడు "అక్కడ ఇంటిమీద అద్దెలు భాగానే వస్తాయిగా, ఈ మధ్య రిపేర్లేవో కూడా చేయించాడుగా" అనీ

మరొకడు "షేర్లు బాగా కొంటుంటాడుగా, బాగానే సంపాదించాడ్లే" అనీ

"ఇక్కడకూడా అపార్ట్‌మెంట్ ఒకటి కొనాలనుకుంటున్నాడు. లోను కూడా తీసుకోవాలనుకుంటున్నట్లున్నాడు" అని ఇంకొకడు... ఇలా ఇలా... నీ విషయాలన్నీ వాళ్లకి తెలిసినవేననిపించేటట్లు, నా దగ్గర్నుంచి ఇంకా అదనపు సమాచారం సేకరించాలని మహా తపన పడిపోయారు. అదుగో ఆ 'ఆరాటమే నాక్కోపం తెప్పించింది" చెప్పడం ముగించాడు ఉపేంద్ర.

"ఇంకొకరి సమస్యల్ని, సమాచారాన్ని ఇలా వేరే వాళ్ళ దగ్గర్నుంచి సేకరించడం మహా మేధావితనం అనుకుని మురిసిపోతుంటారు కొంతమంది. అలా సేకరించిన విషయాల్ని మళ్లీ వాళ్ల దగ్గర, వీళ్ల దగ్గర కాస్తంత కల్పన జోడించి కథలు కథలుగా చెప్పుకుని సంబరపడిపోతుంటారు. అలాంటి వాళ్ల గురించి జాలిపడటం తప్ప, కోపగించుకోవటం అనవసరంరా ఉపేంద్ర" అన్నాను అనునయంగా.

"జాలి పడాలా! ఎందుకు?"

"వాళ్ల వాళ్ల సమస్యల్తో సతమతమైపోతూనే పక్కవారి సమస్యలు కూడా వినటానికి సాహసిస్తుంటారు కదా... అందుకు"

"అదేం కాదు... నీకసలు ఇంకో రహస్యం తెలిసినట్లు లేదు. ఇటువంటి వారికి స్వంత సమస్యలంటూ ఏమీ ఉండవ్. ఉన్నా ఎవరికీ చెప్పుకోరు, చెప్పుకోలేరు... అదటుంచి అసలు పక్కవాళ్లకి ఏ సమస్యా లేకపోవటమే వాళ్ళకి అసలైన సమస్య" అని పెద్దగా నవ్వేడు ఉపేంద్ర.

వాడి మనసులో చెలరేగిన ఆవేదనంతా నాతో చెప్పుకునేసరికి, వాడి కోపం చల్లారిపోయింది. హాయిగా నవ్వేడు. నిర్మలంగా ఉంది ఆ నవ్వు.

"ఇంతకీ నీక్కోపం ఎందుకు రావాలో నాకయితే అర్థం కాలేదు" అన్నాను వాణ్ని ఉడికించేందుకు.

"నువ్వూ ఆ తాన్లో గుడ్డవేగదురా" అని నా వీపు చరిచాడు గట్టిగా.

"బాగా చెప్పేరు అన్నయ్యగారూ... రండి భోజనం చేద్దురు" వత్తాసు పలికింది జయంతి.

నోరు మూసుకుని (?) భోజనం చేయక తప్పిందికాదు నాకు.

❋

## హైకూలు

**జలపర్వం**

చిటి తరగల మగ్గంపై
లలి వెన్నెల దారాలు
పరే ఓ నేత వలువ...
ప్రవహించే ఆకాశం
దీపతార మినుకుల్లో
చలి కాచుకు కార్తీకం...
మునుమాపటి సూర్యుడ్ని
పడమటింటి గడప మీద
దీపంగా మోస్తోంది..ఏరు...
ఆ ఏరే చంద్రుడ్ని
పూల నీలి కబరిలో
పసిడి నాగరం చేసింది...
పాయలుగా విడి
పాపిటలో సిందూరం
పచరించిన ఉదయ "స్రవ"...
సిగ్గు వలువ లూడదీసి
తోగ విరిసి నవ్వితే
రెప్పేయదు వెన్నెల...
చినుకు పూల తోటలో
చిలిపి వంక పక్క
తూలుతున్న "హైకూ" వేసిందో చుక్క

**- సాంధ్యశ్రీ**